ప్రజాశక్తి
శుక్రవారం 9 మే 2025 5 అనంతపురం

'68,379 బంగారు కుటుంబాలు' గుర్తింపు

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వం దగ్గర ఉన్న వివరాలు, సర్వేల ఆధారంగా జిల్లాలో 68,379 పి-4 కింద బంగారు కుటుంబాలను గుర్తించామని కలెక్టర్ తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జీరో పావర్టీ పి4 బంగారు కుటుంభం, మార్గదర్శి కార్యక్రమం, అకాల వర్షాల వల్ల వచ్చే ఉరుములు, మెరుపులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించడానికి సమాజంలోని సంపన్న వర్గాలైన ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు పైస్థాయి ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం వక్తులను గుర్తించి వారి ద్వారా సమాజంలో దిగువ ఉన్న 20 శాతం కుటుంబాలకు సహాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం పి-4 కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనుకునే మార్గదర్శకులు zeropovertyp4.ap.gov.in అనే వెబ్ సైటులో రిజిస్టర్ చేసి, లాగిన్ ద్వారా దత్తత తీసుకోవచ్చన్నారు.

◆ వర్షాలు వస్తాయన్న సమాచారం ఉన్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అకాల వర్షాలతోపాటు పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ప్రజలు తగిన రక్షణ ప్రాంతాల్లో ఉండాలన్నారు. ఏప్రిల్ నెలలో 21వ తేదీన జరిగిన అకాల వర్షాలు వల్ల వ్యవసాయ రంగానికి సంబంధించి 15.90 కోట్ల రూపాయలు, హార్టికల్చర్‌కు సంబంధించి 43 లక్షల రూపాయల నష్టం జరిగిందన్నారు. మే 3వ తేదీన వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన నష్టాల గురించి నివేదికలను ప్రభుత్వానికి పంపామన్నారు.

◆ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నాడు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. హెలిప్యాడ్, ప్రజావేదిక, హెచ్ఎన్ఎస్ కాలవ పరిశీలనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలియజేశారు. విలేకరుల సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, సిపిఒ అశోక్ కుమార్, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి పాల్గొన్నారు.



హెచ్‌ఎల్సీ వైపు చూడండి..!

◆ హంద్రీనీవా రెండో విడత లైనింగ్‌పై రైతుల విముఖత
◆ శిథిలావస్థకు చేరుతున్న తాగునీటి ప్రాజెక్టులు
◆ నేడు ముఖ్యంత్రి చంద్రబాబు హంద్రీనీవా పరిశీలన
◆ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా వైపే కాదు... కాస్త తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్ఎల్‌సి) వైపు కాస్త చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అనంతపురం జిల్లాకు నిఖర జలాలు అందించే ఏకైక ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ కాలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయి ఉన్నాయి. దీంతో పూర్తి ప్రవాహ సామర్థ్యం మేరకు నీటిని తీసుకోలేని పరిస్థితి నెలకొంది. 2024 సంవత్సరంలోనూ ఇదే తరహాలో నీటి పొందలేకపోవడం జరిగింది. తుంగభద్ర డ్యామ్ గేట్లు కొట్టుకుపోయి నీరు వృథాగా కిందకుపోతున్నా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువలో మాత్రం నీటిని పూర్తిస్థాయిలో డ్రా చేయలేకపోవడం జరిగింది. కాలువ గట్లు మొత్తం బలహీనంగా ఉండటంతో నీరు తక్కువగా డ్రా చేస్తున్నారు. పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకోవాలంటే మధ్యలో ఆగిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ చేపట్టాల్సి ఉంది. ఇదివరకు చేపట్టిన ఆధునీకరణ పనులను గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. మరో ఐదేళ్ల పనులు చేపట్టేందుకు వీల్లేదన్న షరతులు పెట్టింది. ఈ షరతులు రద్దై కూడా ఈ ఏడాది ఐదేళ్ల పూర్తవుతోంది. ఈ ప్రభుత్వమైనా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

హంద్రీనీవా మొదటి దశ వెడల్పు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో జిల్లా జీవనాడి అయిన హెచ్ఎల్‌సికి అదే ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నారు. ఇక రెండో దశ లైనింగ్‌పై రైతుల్లో విముఖత వ్యక్తమవుతోంది. లైనింగ్ చేపడితే ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న పద్ధతుల్లోనే నీటిని ప్రవహింపజేస్తే భూగర్భ జలాలు పెరిగి ఉద్యానవన పంటలకు ఊతమిచ్చేందుకు అవకాశముంటుందని కోరుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నాడు జిల్లా పర్యటన సందర్భంగా పై రెండు అంశాలను పరిగణలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

శిథిలావస్థలో తాగునీటి ప్రాజెక్టులు

అనంతపురం జిల్లాలో తాగునీటి అందించే ప్రధాన ప్రాజెక్టుల్లో సత్యసాయి తాగునీటి పథకం ఒకటి కాగా, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టు. సత్యసాయి బాబా సహకారంతో ఏర్పాటైన సత్యసాయి తాగునీటి పథకం పూర్తై మూడు దశాబ్దాలు కావస్తున్నా నేపథ్యంలో పైపులైన్ సిస్టం పూర్తిగా దెబ్బతింది. దీంతో నిరంతరాయంగా మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిర్మాణ సమయంలోనే నాణ్యతా లోపాలుండడంతో ఆ ప్రాజెక్టులోనూ సాంకేతిక సమస్యలు తరచూ వస్తున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులను పునరుద్ధరించాల్సిన అవసరముందని నిపుణులు సైతం చెబుతున్నారు. ఇక ఇందులో పనిచేసే కార్మికుల సమస్యలు వేరే చెప్పనక్కర్లేదు. వేతనాల కోసం నిరంతరంగా సమ్మెలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వేతనాలకు ప్రత్యేకమైన బడ్జెట్ లేకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా మారుతోంది. మూడు నుంచి ఆరు మాసాలైన వేతనాలు అందటం లేదు. ప్రస్తుతం కూడా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోనున్నారు. ప్రభుత్వం దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కార్మికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగనుంది ఇలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని ఉండవల్లి నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి పుట్టపర్తి విమానాశ్రయానికి ఉదయం 10.50 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో 10.55 గంటలకు బయలుదేరి వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామం చేరుకుంటారు. 11.25 గంటలకు రోడ్డు మార్గంలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిస్తారు. 12.15 గంటలకు ఛాయపురం గ్రామం చేరుకుని ప్రజావేదిక వద్ద అధికారులు, ఇంజనీర్లతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ప్రజావేదిక నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. 3.40 గంటలకు విమానంలో బయలుదేరి బెంగళూరుకు వెళ్తారు. సాయంత్రం 5.30 గంటలకు బెంగళూరులోని తాజ్ హోటల్‌లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు వెళ్తారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిమిత్తం ఛాయాపురం వద్ద ఏర్పాటు చేసిన విడిది సమూహాలు

ముఖ్యమంత్రి పర్యన ఏర్పాట్లు పరిశీలన

ఉరవకొండ : ముఖ్యమంత్రి పర్యటన కోసం పటిష్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు, గ్రామ సభకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని మంత్రి తెలిపారు.

'కార్పొరేషన్' తీరుపై కలెక్టర్ ఆగ్రహం..!

◆ టైటిల్ ట్రాన్స్‌ఫర్ జాప్యంపై అసహనం
◆ కార్పొరేషన్ పనులూ మేమే చేయాలా... అంటూ మండిపాటు
◆ రెవెన్యూ సిబ్బంది నిర్వాకాలపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో చిన్న కాగితం ముందుకు కదలాలన్నా లంచం ఇవ్వనిదే ఫైలు కదలిక రాదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. గతంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన అధికారి అండదండలతో రెవెన్యూ విభాగం గాడి తప్పినట్లు తెలుస్తోంది. నెల రోజుల క్రితం మదనపల్లికి చెందిన కరుణ అనే మహిళ అన్నదమ్ముల ఆస్తి పంపకాలలో భాగంగా తమ వాటాకు వచ్చిన ఆస్తిలో పేరు మార్పునకు టైటిల్ ట్రాన్స్‌ఫర్ నిమిత్తం కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫైలును ముందకు కదలనివ్వకుండా సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచారు. ఈ అంశంపై మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు సైతం బాధితులు చేశారు. అయినా టైటిల్ ట్రాన్స్‌ఫర్ ఫైల్లో కదిలిక రాలేదు. బాధితులు నాలుగు వారాలుగా మదనపల్లి నుంచి అనంత కార్పొరేషన్ కార్యాలయానికి ప్రదక్షిణలు చేశారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు పని పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టకపోవడంతో విసిగిపోయిన అర్జీదారు కరుణ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక టైటిల్ ట్రాన్స్‌ఫర్ జరగటానికి నెల రోజులుగా తిరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ కమిషనర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ ఉండి కూడా కార్పొరేషన్ పనులను కలెక్టరేట్ జోక్యం చేసుకొని జరిపించాల్సి రావడం ఏమిటంటూ చురకలు వేసినట్టు తెలుస్తోంది. దీనిపై స్పందించిన కమిషనర్ బాలస్వామి బుధవారం నాడు రెవెన్యూ ఆఫీసర్లు విజయకుమార్, లక్ష్మీదేవి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు రజాక్, చంద్రశేఖర్, రఘునాథ్ రెడ్డి, పెద్దక్కలతో పాటు రెవెన్యూ గుమస్తాలతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. టైటిల్ ట్రాన్స్‌ఫర్ విషయాన్ని ప్రస్తావిస్తూ సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు రజాక్, చంద్రశేఖర్ పనితీరుపై కమిషనర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పని విధానంలో పద్ధతి మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదంటూ ఘాటుగానే హెచ్చరించినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి మూలకారణం అయిన అర్జీదారు కరుణ టైటిల్ ట్రాన్స్‌ఫర్ ఫైల్ ఇప్పటికైనా ముందుకు కదిలిందా.. లేదా అన్న దానిపై కార్పొరేషన్ అధికారులు పెదవి విప్పకపోవడం గమనార్హం.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలను వ్యతిరేకిస్తూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహిస్తున్న ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి నరసింహులు తెలిపారు. గురువారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 11 డిమాండ్‌ల సాధన కోసం చేస్తున్న ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్న బిజెపి

◆ ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే రెన్యువల్ చేయాలి
◆ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కెఎ.పాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న కెఎ.పాల్

దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా కేంద్రంలోని బిజెపి పాలన కొనసాగుతోందని ప్రజాశాంతి వ్యవస్థాపకుడు కెఎ.పాల్ అభిప్రాయ పడ్డారు. గురువారం అనంతపురం జిల్లాకు వచ్చిన ఆయన అనంత ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల అడుగులకు మడుగులు వత్తేలా చంద్రబాబు, పవన్, జగన్‌లు రాష్ట్రంలో ఉండడం విచాకరం అన్నారు. రాయలసీమ ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి)కి సంబంధించిన ఎఫ్‌సిఆర్ఎ రెన్యూవల్ కాకుండా కేంద్రం అడ్డుకోవడం సరికాదన్నారు. రెండు నెలల్లోపు రెన్యువల్ ప్రక్రియ చేయకపోతే ఈ విషయంలో తానే చొరవ చూపి దీనిని పూర్తి చేయిస్తానన్నారు. ప్రపంచ దేశాల నుంచి సాయం తీసుకొచ్చే శక్తి సామర్థ్యాలు తనకు ఉన్నాయని దేశం, రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు కృషి అందిస్తానన్నారు. ఇటీవల మరణించిన ఫాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఆయన మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం చేసి నిజాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధం ఆపడానికి తాను పాకిస్తాన్ వెళుతున్నట్లు తెలిపారు.

పస్తులుంటూ పని చేయాలా..?

◆ ముఖ్యమంత్రి దృష్టికి శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలను తీసుకెళ్తాం ◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ప్లేట్లు చరుస్తూ నిరసన తెలుపుతున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు

కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలను పస్తులుంచి పనులు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు గత 33 రోజులుగా సమ్మెలో ఉన్న విషయం తెలిసిందే. కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు సిఐటియు నాయకులు సిద్ధం అయ్యారు. శుక్రవారం నాడు జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను విన్నవిస్తామని తెలియజేశారు. గురువారం ఉదయం కళ్యాణదుర్గం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం నుంచి శ్రీరామిరెడ్డి కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. పళ్లెలను చరుస్తూ మా ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టవా అంటూ నినాదాలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3. నెలల పిఎఫ్, 7 నెలల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమస్యలపై కార్మికులు 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచాకరం అన్నారు. ఉరవకొండలో శుక్రవారం జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో కార్మికులు వారి కుటుంబాలతో సహా అక్కడికి వెళ్లి సమస్యలను విన్నవిస్తారన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి కార్మికుల సంఘం నాయకులు వన్నూరుస్వామి, నరేష్, గంగాధర్, బాషా, నాగరాజు పాల్గొన్నారు.

గుత్తి ఇఒఆర్‌డి శివాజీరెడ్డికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలో ఇఒఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న శివాజీరెడ్డికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ)గా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ నుంచి నియామక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

కార్మికులకు నష్టం చేకూర్చేలా లేబర్ కోడ్‌లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికుల శ్రమను యజమానులకు దోచిపెట్టి వెట్టిచాకిరిలోకి నెట్టివేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదిన కార్మిక, శ్రామిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం నగరంలో సమావేశాలు నిర్వహించారు. తాడిపత్రి బస్ స్టాండ్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సార్వత్రిక సమ్మెబుక్ లెట్‌ను ఆవిష్కరించరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, హమాలీ యూనియన్ నాయకులు ఆదినారాయణ, నరసింహులు, రాజన్న తదితరులు పాల్గొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు మద్దతు ప్రకటించారు.

ఉద్యోగులతో కలిసి బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

మోడల్ డీఎస్సీ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

డిఇఒ ఎం.ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 24వతేదీన నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షలను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డిఇఒ ఎం.ప్రసాద్‌బాబు సూచించారు. గురువారం నగరంలోని డిఇఒ కార్యాలయంలో అర్బన్ బ్యాంకు ఛైర్మన్ మురళీధర్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర రమేష్‌తో కలిసి ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఎస్ఆర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మోడల్ డీఎస్సీ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 90590 55965ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు ఎం.చంద్రశేఖర్, కృష్ణకుమార్, జె.వెంకటాద్రి, రొళ్ల భాస్కర్, అనిల్‌నాయుడు, టిడిపి నాయకులు డిష్ ప్రకాష్, సునీల్‌రాయల్, మాధవ, అక్కులప్ప, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి కె.మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

11న అనంతలో డివైఎఫ్ఐ జిల్లా మహాసభలు

పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న డా॥గేయానంద్

డివైఎఫ్ఐ 14వ జిల్లా మహాసభలు ఈ నెల 11వ తేదీన అనంతపురం నగరంలో జరగనున్నాయి. మహాసభల పోస్టర్లను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రజావైద్య శాల వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి ఇచ్చే పరిశ్రమల కోసం, కుల మతాలకు అతీతంగా విలువలతో కూడిన యువత కోసం కృషి చేస్తున్న డివైఎఫ్ఐ జిల్లా మహాసభల జయప్రదం చేయాలన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయినా ఆ హామీ నెరవేరలేదన్నారు. యువతకు ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 2017- 2022 మధ్య రెండు కోట్ల మంది మహిళలు ఉపాధి కోల్పోయారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు ప్రకటించాయని తెలిపారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపన కోసం ఒప్పందాలు జరుగుతున్నట్లుగా ప్రభుత్వాల హడావుడి తప్ప ఇప్పటివరకు ఏ ఒక్క భారీ పరిశ్రమ స్థాపించిన దాఖలాలు లేవన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ పేరుతో రాజకీయ పార్టీలు లబ్ధి పొందుతున్నాయే తప్ప నిరుద్యోగ సమస్య పరిష్కారం కాలేదన్నారు. నిరుద్యోగ భృతి అమలు కాలేదన్నారు. ఈ పరిస్థితుల్లో యువత ఉద్యోగం కోసం, విలువలతో కూడిన భవిష్యత్తు కోసం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కృషి చేస్తుండడం అభినందనీయం అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వీటి సాధన కోసం రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. 11న జరుగుతున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు, నాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

'సదరం' సర్టిఫికెట్ల పరిశీలనలో వికలాంగుల పాట్లు

సమయానికి రాని వైద్యులు-గంటల తరబడి ఎదురుచూపు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సదరం సర్టిఫికెట్ల పరిశీలన వికలాంగుల పాలిట శాపంగా మారుతోంది. ఉదయం 8 గంటలకే వికలాంగులు కేంద్రానికి చేరుకుంటున్నా వైద్యులు మాత్రం మధ్యాహ్నం 12 గంటల వరకూ రావడం లేదు. దీంతో వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శింగనమల సామాజిక ఆరోగ్య కేంద్రంలో వారంలో రెండు రోజులు సదరం సర్టిఫికెట్ల తనిఖీ చేస్తారు. ఈ కేంద్రానికి మండలంతోపాటు నార్పల మండలం నుంచి ఒక్కో రోజు దాదాపు వంద నుంచి 120 మంది వికలాంగుల వరకూ సర్టిఫికెట్లను తనిఖీ చేయించుకునేందుకు వస్తున్నారు. వీరందరూ తమకు నోటీసులో ఇచ్చిన సమయం మేరకు ఉదయం 8గంటలకే కేంద్రానికి చేరుకుంటున్నారు. అయితే వైద్యులు మాత్రం వారికి ఇష్టం వచ్చినట్లు వస్తున్నారని వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరాలకు వెళ్లాలన్నా ఎప్పుడు వైద్యులు వస్తారో చెప్పలేని పరిస్థితి అంటున్నారు. అంతసేపు ఎదురుచూసినా డాక్టర్ మాత్రం తనకి ఇష్టం వచ్చినప్పుడు వచ్చి గంట మాత్రం ఉండి వెళ్లిపోతున్నాడని వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వికలాంగుల సర్టిఫికెట్ల పరిశీలన చేసేందుకు వైద్యులు సమయానికి అనుగుణంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని వికలాంగులు కోరుతున్నారు.

శింగనమల ఆరోగ్య కేంద్రంలో ఇబ్బందులు పడుతున్న వికలాంగులు

ప్రజాశక్తి
www.prajasakti.com

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో అనేక మంది పేదలు జీవిస్తున్నారన్నారు. వారందరూ నగరంలోని అద్దె ఇళ్లల్లో ఉంటూ అద్దెలు కట్టలేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉంటోందన్నారు. దీనికితోడు నిత్యావసర సరుకుల ధరలు పెరిగి దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తే కనీసం గుడిసెలు వేసుకుని అయినా జీవిస్తారన్నారు. అనంతరం ఇళ్లు మంజూరు చేస్తే కట్టుకుంటారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ముత్తుజ, వెంకట్ నారాయణ, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని నిర్ణయిస్తే ముందుగా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అత్యంత అవసర సేవలను అందిస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాయదుర్గం పురపాలక సంఘంలో వివిధ కారణాల వల్ల మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాల్సి ఉండగా నేటికీ ఒకరికి కూడా ఉద్యోగం కల్పించిన పరిస్థితి లేదని మండిపడ్డారు. రోజురోజుకూ పట్టణం విస్తరిస్తున్నా కార్మికుల సంఖ్యను మాత్రం పెంచడం లేదన్నారు. తక్షణమే పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించుకోకపోతే ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెతోపాటు 21, 22 తేదీల్లో మున్సిపల్ కార్మికులు సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి రాము, కార్మికులు సిద్ధ, ఎర్రిస్వామి, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులను ఆపండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా లైనింగ్ పనులను ఆపి డిస్ట్రిబ్యూటర్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఉరవకొండలోని దేవాంగ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచాలని డిమాండ్ చేశారు. మిర్చి, కందులు, గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనను దృష్టిలో ఉంచుకుని హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను ఆపి వేయాలన్నారు. డిస్ట్రిబ్యూటర్ ఏర్పాటు చేసి కరువు రైతులను ఆదుకోవాలని కోరారు. మిర్చి, కంది పంటలు సాగు చేసిన రైతన్నలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలకు ధరలు లేక విలువలు ఆడుతున్న రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ సోనియా శీనా, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బాల్య వివాహాలను అరిట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిహెచ్ఎన్ చిలకమ్మ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని ఉంతకట్లు సచివాలయంలో ఎఎన్ఎం మెహరీన్ బేగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్ఎన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పదో తరగతి, ఇంటర్ చదివిన వెంటనే అమ్మాయిలకు వివాహాలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. వాటిని అరికట్టాలని ముఖ్యమంత్రి, కలెక్టర్, జిల్లా అధికారులు కలిసి సభలు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కావున బాల్య వివాహాలను అరికట్టి బాలికలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు పెళ్లి చేయడం చట్ట విరుద్ధమని ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం రాయదుర్గంలోని వడ్రవనూరు గ్రామంలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై టీనేజ్ బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల పరిధిలోని గంగులకుంట గ్రామంలో రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధక చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణమ్మ, ఎఎన్ఎం అనిత, అంగన్వాడీ కార్యకర్త అరుణ, ఆశా కార్యకర్త సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి పెన్నోబిలేసుని బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ : ఈనెల 9వతేదీ నుంచి 20వ తేదీ వరకూ మండల సమీపంలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ రమేష్‌బాబు, ఆలయ అర్చకులు ద్వారకానాథ్, బాలాజీస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం అమిద్యాల గ్రామం నుంచి మేళతాళాల మధ్య శ్రీవారి ఉత్సవ విగ్రహాలను తీసుకురానున్నట్లు తెలిపారు. 10న ఉదయం ధ్వజారోహణం అంకురార్పణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 17న బ్రహ్మరథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలి

అనంతపురం : రాష్ట్రంలో డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు వయో పరిమితి పెంచాలని హిందీ సేవాసదన్ వ్యవస్థాపకుడు, యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.గైబువల్లి గురువారం ఒక ప్రకటనలో కోరారు. డీఎస్సీ అభ్యర్థుల మానసిక క్షోభను సిఎం చంద్రబాబుతోపాటు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలుసుకుని వయోపరిమితి పెంచాలన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

పాటలు పాడుతున్న కళాజాతా బృందం

అనంతపురం : కళాజాత ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలని జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారిణి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కలిగించేందుకు కళాజాతాకు గురువారం స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో 20 రోజులు పాటు కళాబందాలు రోజుకొక చోట వీధి నాటక కళారూపం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ జివి రమణ, పిఎంఒ నాగన్న, మురళి, నారాయణస్వామి, ఛైల్డ్ ఫండ్ ఇండియా రమేష్ యాదవ్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పదిరోజుల్లో పూడికతీత పూర్తి చేస్తాం

పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికను పదిరోజుల్లో తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా ముత్రాసి కాలనీ, బైపాస్ రోడ్, పార్వతీనగర్ పెద్ద కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. రాబోవు పదిరోజుల్లో పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ రవిప్రకాష్ నాయుడు, ఎఇ నరసింహులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలి

సిఎంకు ప్రజాసంఘాల ఐక్య వేదిక నేతల బహిరంగ లేఖ

బహిరంగ లేఖలను చూపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హంద్రీనీవా ప్రాజెక్ట్ ప్రయోజనాలను కుదించేలా ప్రభుత్వాలు జారీ చేసిన 404, 405 జిఓలను తక్షణమే రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్య ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలు డిమాండ్ చేశారు. గురువారం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద హంద్రీనీవా ప్రాజెక్ట్‌కు నిధులు, ఖర్చు, ఎదురౌతున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలు ఆర్.రామ్‌కుమార్, ఎస్ఎం.బాషా, చంద్రశేఖర్‌రెడ్డి, చిరుతల మల్లికార్జున, నాగరాజు, యం.క్రిష్ణమూర్తి, యం.బాలరంగయ్య, ఉపేంద్ర, వీరనారప్ప, యేసు రత్నం తదితరులు మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు కాలువను మల్యాల నుంచి జీడిపల్లి వరకు 3850 క్యూసెక్కులు వెడల్పునకు, జీడిపల్లి నుంచి చిత్తూరు జిల్లా వరకు కాలువ లైనింగ్ పనులు చేయడానికి కూటమి ప్రభుత్వం 3-12-2024న 404, 405 జిఓలను జారీ చేసిందన్నారు. ఈ విధానం వల్ల ఉమ్మడి జిల్లాకు నష్టం జరుగుతుందన్నారు. రైతులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. మాల్యాల నుంచి జీడిపల్లి వరకు ప్రధాన కాలువ 10వేల క్యూసెక్కులకు వెడల్పు చేయాలన్నారు. జీడిపల్లి నుంచి కిందకు 6వేల క్యూసెక్కులకు కాలువ వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కాలువ లైనింగ్ వల్ల భూగర్భ జలాలకు నష్టం జరుగుతుందని లైనింగ్ ఆపు చేసి కాలువ వెడల్పు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ ఎన్డీఎ ప్రభుత్వం ఇవి పరిగణలోనికి తీసుకోకుండా ఆఘమేఘాల మీద ఇందుకు తగిన నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించారని తెలిపారు. జూలై 10 నాటికి పూర్తీ చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారని తెలిపారు. ఈ నెల 9న జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులు పెంచుతామని హామీ ఇచ్చార ని వాటిని నిలబెట్టుకోవాలన్నారు. అలా కాకుండా సామర్థ్యాన్ని కుదించి 3850 క్యూసెక్కులకు కాలువ వెడల్పు చేయడం సరికాద ని, దీని వల్ల అనంతపురం జిల్లాకు అన్యాయం జరుగుతుంద న్నారు. కావున సిఎం చంద్రబాబు స్పందించి జిల్లాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు చంద్రప్ప, చెన్నప్ప యాదవ్, హరినాథ్ రెడ్డి, బిహెచ్.రాయుడు, బి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు రెండు నెలల వేతనాలు మంజూరు

ధర్నా శిబిరం వద్దే చెక్కులు సిద్ధం

యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అదనపు కార్మికులకు రెండు నెలల బకాయి జీతాలకు సంబంధించి వేతనాలు మంజూరు చేసేందుకు డిప్యూటీ కమిషనర్ పావని ఆదేశాలు జారీ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులుగా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా డిప్యూటీ కమిషనర్ పావని గురువారం ధర్నా శిబిరం వద్దకు వచ్చి కార్మికుల సమస్యలు సావధానంగా విన్నారు. అనంతరం రెండు నెలల వేతనాలు మంజూరు చేస్తూ ఎఫ్ వన్ గుమాస్తాను కార్మికుల ధర్నా శిబిరం వద్దకు పిలిపించి చెక్కులు రెడీ చేయించి ఒక చెక్కును బ్యాంకుకు పంపారు. మరో చెక్కును కమిషనర్ సంతకం తర్వాత బ్యాంకుకు పంపిస్తామని తెలిపారు.

అంతకుముందు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు కార్మికుల సమస్యలను డిప్యూటీ కమిషనర్‌కు వివరించారు. ముఖ్యంగా నాలుగు రోజులపాటు మున్సిపల్ కార్మికులు మండుటెండలో కూర్చొని సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్నారన్నారు. ప్రజలకు అనుకూలంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. అలాగే మహిళలందరికీ ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కార్మికులకు రూ.15 వేల వేతనం, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ కమిషనర్‌తో చర్చించి ఆయా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేష్, నగర ట్రెజరర్ లక్ష్మీనరసమ్మ, మహిళా కన్వీనర్ వరలక్ష్మి, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌మూర్తి, నాగేంద్ర, పుల్లన్న, ప్రభాకర్, రాఘవేంద్ర ప్రసాద్, పెన్నా, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

టిడిపి నాయకుడి మృతికి నివాళి

నార్పల : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పోతలయ్య మృతికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం నివాళు లర్పించారు. గొల్లపల్లి గ్రామానికి చేరుకున్న ఎమ్మె ల్యే పోతులయ్య మృతదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యుల ను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, ఆకుల విజయ్‌కుమార్ బాబు, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం : అనంతపురం ప్రాంతీ య నిఘా, అమలు అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం బొమ్మనహాల్ మండలంలో దాడి నిర్వహించారు. బొమ్మనహాల్ మండలం సంగ మేశ్వర ఆలయం వద్ద కర్ణాటక రాష్ట్రంలోని చిత్ర దుర్గ్ జిల్లా బిజి కేరే గ్రామానికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ట్లు తెలిపారు. అంతేగాకుండా డ్రైవర్ బసవరాజు, బియ్యం వ్యాపారులు జి.యల్లప్ప, రుద్రన్నపై క్రిమినల్ కేసులు నమోదు చేయించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో అధికారులు జి.గోపాలుడు, ఎల్.రవీంద్రనాథ్, పి.లక్ష్మీకాంత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర స్థావరాలపై సైనికుల దాడి అభినందనీయం

శింగనమల : పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేసిన దాడి చేసి దేశ ప్రజల గుండెల్లో ధైర్యాన్ని నింపిందని రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఆ దేశ పౌరులను లక్ష్యం చేయకుండా ఉగ్రమూకల కేవలం స్థావరాలపైనే గురిపెట్టడం దేశ సైనికులకు ఉన్న విలువలను ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. పహల్గాం ఉగ్రదాడికి భారత్ సైన్యం దీటుగా బదులివ్వడం సంతోషకరమన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

బొమ్మనహాల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదలకు అనేక సేవలు చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)ని కాపాడుకుందామని అంబేద్కర్ యువసేన నాయకులు పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు సేవ్ ఆర్డీటీ పేరుతో మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా వినాయక సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి దళితులు, లౌకికవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం

పిల్లకాలువలు పూర్తి చేశాకే లైనింగ్ పనులు చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం : హంద్రీనీవా కాలువ పిల్ల కాలువలు పూర్తి చేశాకే లైనింగ్ పనులు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్ల కాలువల ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చాకే లైనింగ్ పనులు చేపట్టాలన్నారు. డిపిఆర్ ప్రాజెక్టులో లైనింగ్ పనులు మొదలు పెట్టారని మండిపడ్డారు. గండికోట నుంచి కడప, చిత్తూరుకు 20 టిఎంసిలు నీళ్లు ఇవ్వాలని అప్పటి సిఎం జగన్ ప్రాజెక్ట్ రూపొందిస్తే చంద్రబాబు రద్దు చేయడం బాధాకమరన్నారు. అలాగే అన్యాయం ప్రశ్నించే వారిపై కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 11 నెలల్లో రూ.250 కోట్లు పేదల ఆరోగ్యం కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా నియోజకవర్గంలో రూ.1.50 కోట్ల సాయం అందించడం గర్వంగా ఉందని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 11 మందికి రూ.13.34 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కోనంకి గంగారామ్, భవాని రవికుమార్, సరిపూటి రమణ, బాలాంజనేయులు, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న, వడ్డే సరళ, ఫిరోజ్ అహ్మద్, రాయల్ మధు, జెఎం బాషా, గోపాల్ గౌడ్, నారాయణస్వామి యాదవ్, ఈడిగ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో డబ్బుల వసూళ్లు బాధాకరం

ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులతో డబ్బులు వసూలు చేయడం బాధాకరమని ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, ఉమామహేష్ అన్నారు. విద్యార్థులతో డబ్బులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక ఐటిఐ కళాశాల ముందు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వారం రోజులు విద్యార్థులు కళాశాలకు రాకపోతే రూ.వేయ్యి వసూలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే సంబంధిత ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర కోశాధికారి నాని, నగర సహాయ కార్యదర్శి సమీర్, సాయి, ప్రవీణ్, బాబు, జాన్, ప్రశాంత్, సుపియన్, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులతో ముఖాముఖి

ముఖాముఖిలో పాల్గొన్న సంచార జాతి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సంచార జాతుల కుటుంబాలతో గురువారం స్థానిక శ్రీకృష్ణదేరాయ యూనివర్శిటీలో ముఖాముఖి నిర్వహించారు. ఇందులో భాగంగా సంచార జాతుల జీవన స్థితిగతులు, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్‌లో అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖాముఖి అంతా యుజిసి లైవ్ స్ట్రీమ్ ప్రోగ్రాం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఎస్ఐ అధ్యక్షులు ఎం.ముని నారాయణప్ప, మైసూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నంజుండప్ప, హైదరాబాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ తాహా, తమిళనాడుకు చెందిన అలివేలమ్మ, సహ నిర్వాహకులు శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, సిబ్బంది టి.కృష్ణారెడ్డి, బి.కొండారెడ్డి, బి.పద్మావతి, నర్మదా, ప్రశాంత్‌రెడ్డి, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నీటి తొట్టెలతో ఉపయోగం

తొట్టెలో నీరు తాగుతున్న గొర్రెలు

పెద్దవడుగూరు : మూగజీవాల నిమిత్తం ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన నీటి తొట్లతో చాలా ఉపయోగాలు ఉన్నాయని ఎపిఒ పుల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 25 పంచాయతీలు ఉండగా 30 నీటితొట్టెలను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 12 తొట్లను పూర్తి చేసినటుల తెలిపారు. ఆయా తొట్లు గ్రామాల్లో పశువులకు దాహార్తిని తీరుస్తున్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో కొన్ని సమస్యలు వస్తున్నాయన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజు ఆధ్వర్యంలో గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా రక్త పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ షబ్బీర్ అహమ్మద్, సరోజమ్మ, ఎఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు కొత్త కొట్టాల కాలనీకి మాజీ ఎంపిపి డేలూరు రంగయ్య సొంత నిధులతో ట్యాంకర్ ఏర్పాటు చేసి గురువారం తాగునీరు సరఫరా చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించడంతో మాజీ ఎంపిపికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డులకు శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దార్ పుణ్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్ కార్డు పొందాలన్నా.. పేరు మార్చుకోవాలన్నా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు.

గ్రంథాలయాల తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సమ్మర్ క్యాంపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు 30 మంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ఇండోర్ గేమ్స్ క్యారమ్స్, చెస్, టెన్నిక్యాట్ రింగ్, స్కిప్పింగ్ రోప్ వంటి అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారి జి.కృష్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

11న మార్షల్ ఆర్ట్స్ క్లాసులు ప్రారంభం

పామిడి : స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఈనెల 11వతేదీ కరాటే, తైక్వాండో, జూడో మార్షల్ ఆర్ట్స్ క్లాసులను ప్రారంభించనున్నట్లు జాతీయ స్థాయి గోల్డ్ మెడల్ సాధించిన శిక్షకులు సాయి గోవిందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి సినీ హీరో భానుచందర్, హీరో సుమన్, సినిమా ఫైట్ మాస్టర్ సాకే అశోక్ రాజు విచ్చేయనున్నట్లు తెలిపారు.

ఫైలేరియాపై సర్వే

రాప్తాడు : మండల పరిధిలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో ఫైలేరియా సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లిసుమారు 500 మందికి రక్తపూతలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్లు శ్రీధర్, నూర్‌బాషా, ఎంపిహెచ్ఇఒ మునాఫ్, పిహెచ్‌సి సూపర్‌వైజర్ నరసింహ, ఎంపిహెచ్ఒ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

బెలుగుప్ప : మండల కేంద్రంలో వెలసిన విరూపాక్షేశ్వర స్వామి ఆశ్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు స్వామి వారికి గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, దేవనాండి పూజ, పంచగవ్య, ఆరాధన, రక్షాబంధనం, ఆచార్యాది, రుత్వక్వరణం, నవగ్రహపూజలు చేశారు. తర్వాత పంచగవ్య అభిషేకం, పంచామత అభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, నేత్రోన్మిలనం, పూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్పీటీసీకి తీవ్రగాయాలు

గాయపడిన జెడ్పీటీసీ

కుందుర్పి : మండల కేంద్రంలోని కెజిబివి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. జెడ్పీటీసీ గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జడ్పీటీసీ రాధాస్వామి, ఉప్పర రాజు కలిసి ద్విచక్ర వాహనంలో గ్రామ చివరకు వెళ్లి వస్తుండగా కుందుర్పి నుంచి బండమీదపల్లి వెళ్తున్న రాళ్ల ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో జడ్పీటీసీ రాధాస్వామి, రాజు గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 ద్వారా కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. అయితే రాజు మార్గమధ్యంలో మృతిచెందాడు. జడ్పిటిసికి కుడికాలు పూర్తిగా విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. మరోవైపు ట్రాక్టర్ డ్రైవర్ కూడా గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన మహేంద్ర అనే యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిల మేరకు.. గ్రామానికి చెందిన మహేంద్ర గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో పలు చోట్ల చికిత్సలకు చేయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన మహేంద్ర గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తన స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బసినేపల్లిలో నలుగురిపై దాడి

గుత్తి మండలంలోని బసినేపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నలుగురిపై దాడి జరిగింది. గ్రామానికి చెందిన బొలికొండ, రమేష్‌కు పొలం రస్తా విషయంలో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో వాగ్వివాదం జరిగే బొలికొండ, శివరంగడు, రంగడు, చంద్రకళపై రమేష్ రవి, వెంకటరాముడు లు కర్రలు, రాళ్లతో దాడి చేశారని బాధితులు తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ నలుగురిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా మరో వర్గం ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గుత్తి మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు కరిడికొండ గ్రామానికి చెందిన చంద్రమోహన్ ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపునకు వెళు న్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రమోహన్‌ను గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అతడిని అనంతపురంకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.